క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడిని పరామర్శించిన కేపీ


కదం శీనును పరామర్శిస్తున్న కేపీ నాగార్జునరెడ్డి

కంభం: గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, వార్డు మెంబర్ కదం శ్రీనును కంభంలోని ఆయన నివాసంలో బుధవారం ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీ నెమలిదిన్నె చెన్నారెడ్డి, స్టేట్ మైనారిటీ సెల్ సెక్రటరీ గఫార్ అలీఖాన్, చేగిరెడ్డి ఓబుల్ రెడ్డి, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, సబ్బసాని సాంబశివారెడ్డి, ఆనంద్, గురుమూర్తి తదితరులుఉన్నారు.

నేడు తురిమెళ్లలో రెవెన్యూ గ్రామ సభ

కంభం: మండలంలోని తురిమెళ్ల గ్రామంలో జేసీ ఆదేశాల మేరకు గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వి. కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తురిమెళ్ల సచివాలయంలో రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. రైతులు తమ సమస్యలపై అర్జీలు ఇస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యతోనే విద్యార్థి భవిష్యత్‌కు భరోసా


మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయరెడ్డి

గిద్దలూరు రూరల్: విద్యతోనే భవిష్యత్‌కు భరోసా లభిస్తుందని స్థానిక తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు బాల్య దశ నుంచే క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకోవాలన్నారు. సమయం ఎంతో విలువైనదని, వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ఎస్.ప్రసన్నకుమారి, యువప్రగతి సంస్థ అధ్యక్షుడు ఫరూక్, విశ్రాంత ఉపాధ్యాయుడు బి.రామిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు


డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విద్యార్థులకు చెస్, డ్రాయింగ్, కథలు, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గురుస్వామి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే మోదీ ధ్యేయం


మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

మార్కాపురం టౌన్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రధానమంత్రి మోదీ వినూత్న సంస్కరణలు తీసుకొచ్చారని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని చెప్పారు. మార్కాపురం, గజ్జలకొండ, దొనకొండ, గిద్దలూరు తదితర రైల్వేస్టేషన్లను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ ఇన్‌చార్జి కృష్ణారావు, విజయలక్ష్మి, ఆంజనేయులు, జీవీరెడ్డి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

మోసపు హామీలతో ప్రజలకు వెన్నుపోటు

- వైఎస్సార్ సీపీ కార్యకర్తలను వేధిస్తే సహించేది లేదు
- వెన్నుపోటు దినం ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు
- అధికారులు బాధ్యతగా పనిచేయాలని హితవు


వినతిపత్రం ఇస్తున్న అన్నా రాంబాబు, పక్కన పార్టీ నేతలు

మార్కాపురం టౌన్: 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ' అంటూ కూటమి నాయకులు ఇంటింటికీ బాండ్ పేపర్లు పంచి, తీరా అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించి ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు విమర్శించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్న సూపర్-6 హామీల్లో ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేసిన పాపాన పోలేదని ధ్వజమెత్తారు. హామీలపై మాటలు దాటవేస్తూ ప్రజలను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మార్కాపురంలో వెన్నుపోటు దినం నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి అన్నా రాంబాబు, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు వెన్నా హనుమారెడ్డి, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ అలీబేగ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. పెన్షన్ మినహా సూపర్-6 హామీల్లో ఏవీ కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతు భరోసా, అమ్మఒడి, ఆరోగ్యశ్రీ తదితర పథకాలన్నీ తొలి ఏడాదే అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రజలతో కలిసి వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అధికారుల ఏకపక్ష ధోరణి సరికాదు

అధికారులు ఏకపక్ష ధోరణితో వ్యవహరించడం సరికాదని, చట్టప్రకారం బాధ్యతగా పనిచేయాలని అన్నా రాంబాబు హితవు పలికారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేసి వేధించడం మానుకుంటే మంచిదన్నారు. మార్కాపురం పట్టణంలో ఆక్రమణల పేరుతో ఏకపక్షంగా వ్యవహరించారని, బాగా ఉన్న గాంధీపార్కును నాశనం చేశారని విమర్శించారు. మార్కాపురం మున్సిపల్ కమిషనరు, దేవస్థానం ఈఓ, ఎన్‌ఫోర్సుమెంటు డీటీ దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరు చేస్తున్న పనులతో ప్రభుత్వానికే నష్టం తప్ప ప్రజలకు ఉపయోగం లేదన్నారు. ఆక్రమణల పేరుతో గాంధీ పార్కును ధ్వంసం చేసి, చిరువ్యాపారుల జీవితాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఆక్రమణల తొలగింపు సందర్భంగా వ్యర్థాలు తొలగించేందుకు సుమారు రూ.50 లక్షలు ఖర్చు చేశారంటూ విస్మయం వ్యక్తం చేశారు. ఇది ప్రజా ధనం దోచుకోవడమే తప్ప మరొకటి కాదన్నారు. ఆలయ భూములను పరిరక్షించాల్సిన దేవదాయ శాఖ ఈఓ.. ఎవరి మెప్పు కోసమో వైఎస్సార్ సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఎవరో బియ్యం అమ్ముకుని వెళ్తుంటే, అవి వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన డీలర్లవే అంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ తప్పుడు కేసులు పెట్టడాన్ని ఆక్షేపించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఎండగడతామని, ప్రజల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను కాపాడుకునేందుకు ముందుంటానని భరోసా ఇచ్చారు. అనంతరం రీడింగ్ రూమ్ సెంటరు, కంభం సెంటరు, కోర్టు సెంటరు మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు పార్టీ నాయకులతో కలిసి ర్యాలీగా వెళ్లి కార్యాలయ ఏఓ అశోక్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, పత్తి రవిచంద్ర, నల్లబోతుల కొండయ్య, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మురారి వెంకటేశ్వర్లు, అక్కిదాసరి ఏడుకొండలు, మురళీకృష్ణ యాదవ్, మందటి మహేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, సిరాజ్, కొత్త కృష్ణ, ఆసిఫ్‌ఖాన్, లయోలా చెంచిరెడ్డి, సలీమ్, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, దుర్గా సాగర్, పి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న అన్నా రాంబాబు, పక్కన పార్టీ నేతలు

అరాచకంగా కూటమి పాలన

- వైఎస్సార్ సీపీ శ్రేణులను వేధించడం తప్ప ప్రజలకు ఏం చేశారు
- వైఎస్ జగన్ ఐదేళ్లలో చేసిన అప్పులో 44 శాతాన్ని కూటమి ఒక్క ఏడాదిలోనే..
- హామీలు అడుగుతుంటే ప్రజలపై అదనపు భారాలు మోపుతారా?
- కూటమి ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ధ్వజం


తహసీల్దార్‌కు అర్జీ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

బేస్తవారిపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను ఏడాది నుంచి అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న తీరును నిరసిస్తూ బుధవారం బేస్తవారిపేటలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కేపీ.. తహసీల్దార్ జితేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలను కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని ధ్వజమెత్తారు. కేవలం వైఎస్సార్ సీపీ నాయకులను టార్గెట్ చేస్తూ వేధించడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన మొత్తం అప్పులో 44 శాతం అప్పును ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం చేసిందని వివరించారు. అయినా ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకుండా, అభివృద్ధి చేయకుండా ప్రజల నెత్తిన భారాలు మోపుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏడాది కాలంలో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. ఏ ఒక్కరోజు కూడా ప్రజల గురించి ఆలోచన చేయని దుర్మార్గమైన పాలనను నేడు చూస్తున్నామన్నారు. కాగా వెన్నుపోటు దినం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీలు బీవీ రాజయ్య, సారె వెంకట నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు ఆవుల శ్రీధర్ రెడ్డి, గొంగటి చెన్నారెడ్డి, ఏరువ రంగారెడ్డి, సీఆర్ఐ మురళి, ఓబులరావు, రవికుమార్, గిద్దలూరు నగర పంచాయతీ అధ్యక్షుడు మానం బాలిరెడ్డి, స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీ నెమలిదిన్నె చెన్నారెడ్డి, స్టేట్ మైనార్టీ సెల్ సెక్రటరీ గఫార్ అలీఖాన్, ఇంటలెక్చువల్ వింగ్ అధ్యక్షుడు బిక్కా రామాంజనేయరెడ్డి, మాజీ ఎంపీపీలు రవికుమార్‌యాదవ్, పి.వెంకటరాజు, వైస్ ఎంపీపీ షేక్ మౌలాలి, చిరంజీవి, డి.ఖాజామియా, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు మల్లెల శేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా బాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి, బొల్లా బాలిరెడ్డి, కొండా రఘునాథరెడ్డి, సయ్యద్ ఖాశీం, సలీమ్, డిష్ మున్నా, పి.ఈశ్వరరెడ్డి, టీడీఎస్‌పీ శర్మ, బొంతల లక్ష్మణస్వామి, మాచర్ల వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భారీగా ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి


బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే కేపీని సన్మానిస్తున్న నాయకులు

- పదవులు పొందిన నేతలకు జెడ్పీ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడి సూచన

కంభం: వైఎస్సార్ సీపీలో పదవులు పొందిన నాయకులు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, గిద్దలూరు ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి సూచించారు. ఇటీవల వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీగా నియమితులైన నెమలిదిన్నె చెన్నారెడ్డి, స్టేట్ మైనారిటీ సెల్ సెక్రటరీగా ఎంఏ గఫార్ అలీఖాన్ బుధవారం చీమకుర్తిలో బూచేపల్లి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. శివప్రసాద్‌రెడ్డి వెంకాయమ్మతోపాటు మాజీ ఎమ్మెల్యే కేపీని గజమాలతో సత్కరించారు. రాష్ట్ర స్థాయి పదవులు వచ్చేందుకు సహకరించినందుకుగాను కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు వెంకటరాజు, మండల కన్వీనర్లు గొంగటి చెన్నారెడ్డి, ఆవుల శ్రీధర్ రెడ్డి, ఏరువ రంగారెడ్డి, సీఆర్ఐ మురళి, నాయకులు చేగిరెడ్డి ఓబుల్ రెడ్డి, పగడాల శ్రీరంగం, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా రామాలయ ప్రతిష్ఠ పూజలు


నూతన ధ్వజ స్తంభ ఊరేగింపులో గ్రామస్తులు

కొనకనమిట్ల: మండలంలోని నాగంపల్లిలో పట్టాభిరామస్వామి ఆలయ నూతన ధ్వజ స్తంభ ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. వేదపండితుడు శేఖర శర్మ పర్యవేక్షణలో తిరుపతి ఆగమ పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. బుధవారం సాయంత్రం నూతన ధ్వజ స్తంభాన్ని భక్తుల కోలాహలం నడుమ ఊరేగించారు. గురువారం పూజా కార్యక్రమాలతోపాటు గ్రామోత్సవం, రాత్రికి కోలాట ప్రదర్శన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- హౌసింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశం


లబ్ధిదారులతో మాట్లడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా హౌసింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. బుధవారం ఉదయం మార్కాపురం పట్టణ పరిధిలోని ఇడుపూరు-1 హౌసింగ్ కాలనీని ఆమె సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇడుపూరు-1 హౌసింగ్ లేఔట్‌లో 2,310 గృహాలు మంజూరుకాగా ఇప్పటి వరకు 154 ఇల్లు పూర్తయ్యాయని, రూఫ్ లెవెల్‌లో 37, రూఫ్ కాస్ట్ స్థాయిలో 430, బేస్‌మెంట్ లెవెల్‌లో 519 ఇళ్లు పురోగతిలో ఉన్నాయని హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సాయంపై అవగాహన కల్పించాలని హౌసింగ్, మున్సిపల్ అధికారులకు సూచించారు. రూఫ్ లెవెల్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ వెంట సబ్‌కలెక్టర్ త్రివినాగ్, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, స్థానిక డీఈ పవన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, తహసీల్దార్ చిరంజీవి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన


రైతులకు మట్టి పరీక్ష ఫలితాల పత్రాలు అందిస్తున్న అధికారులు

కొనకనమిట్ల: ఈ ఏడాది ఖరీఫ్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు అనుసరించి పంటలు సాగు చేసి లబ్ధి పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ అధికారి మానస పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నాగరాజుకుంట, సిద్ధవరం గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ.. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగిస్తే పెట్టుబడి భారం తగ్గుతుందని చెప్పారు. డి.పి.ఆర్ ప్రధాన శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, ఎం.ఉష మాట్లాడుతూ.. మిశ్రమ వ్యవసాయంలో భాగంగా కోళ్ల పెంపకం చేపడితే రైతులకు ఆర్థికంగా లబ్ధి కలుగుతుందన్నారు. బీపీటీ 5204కు ప్రత్యామ్నాయ పంట రకాల గురించి వివరించారు. మట్టి పరీక్షల ప్రాముఖ్యత, డ్రోన్ స్ప్రేయింగ్ గురించి అవగాహన కల్పించారు. ఉద్యానవన పంటలు సాగు చేయడం వల్ల భూతాపం తగ్గి వర్షాలు సక్రమంగా కురవడానికి అవకాశం ఉంటుందన్నారు. రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నట్లు ఏఓ ప్రసన్న రంగలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి రమేష్‌దాస్, నాగరాజుకుంట సర్పంచ్ కేవీ సుబ్బారెడ్డి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మార్కాపురం: మార్కాపురం రూరల్, పెద్దారవీడు మండలాల్లోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ నాగేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని స్పష్టం చేశారు. మార్కాపురం మండలంలోని కొండేపల్లి, రాయవరం, పెద్దారవీడు, చట్లమిట్ల సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

పేదల పక్షాన సీపీఐ పోరాటం

- జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ



మాట్లాడుతున్న ఎంఎల్ నారాయణ

మార్కాపురం:

పేదల పక్షాన సీపీఐ పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ చెప్పారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సీపీఐ నియోజకవర్గ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 21 నుంచి 23 వరకు దర్శిలో పార్టీ జిల్లా మహాసభలు, ఆగస్టులో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని, రైతులను ఆదుకోవడంలో విఫలమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కూడా ఎన్నికల హామీలు నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు అందె నాసరయ్య మాట్లాడుతూ.. పార్టీలో గ్రామ శాఖలు ఏర్పాటు చేసి బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాలకు చెందిన ఎస్కే ఖాశీం, చిత్తారి పెద్దన్న, కోటేశ్వరరావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా మార్కాపురం నియోజకవర్గ నూతన కమిటీ కార్యదర్శిగా ఎస్కే ఖాశీం, సహాయ కార్యదర్శిగా సీహెచ్ పెద్దన్నను ఎన్నుకున్నారు.

మలేరియా నిర్మూలనే లక్ష్యం


పాతపాడులో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

కొనకనమిట్ల: మలేరియా నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలని కొనకనమిట్ల, గొట్లగట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు డాక్టర్ ఎస్పీ బాలయ్య, డాక్టర్ సురేఖ, డాక్టర్ నరేంద్ర సూచించారు. మలేరియా మాసోత్సవాల సందర్భంగా బుధవారం కొనకనమిట్ల, గొట్లగట్టు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై పాతపాడులో ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇంటి పరిసరాల్లో, తొట్లలో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంటే దోమల లార్వా పెరిగే ప్రమాదం ఉందని చెప్పారు. కొబ్బరి బొండాలు, పాత టైర్లు, పాత రోళ్లు లాంటివి ఇంటి పరసరాల్లో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమ తెరలు తప్పనిసరిగా వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ నారాయణరెడ్డి, ఎంపీహెచ్‌ఎస్ జె.వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీ రంగస్వామి, ఏఎన్ఎం షాబిదా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.